ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 18 జూన్ 2025



హద్దులు దాటుతున్న యువత




- చిన్న విషయాలకే గొడవలు
- పోలీస్‌స్టేషన్లకు వివాదాలు
- జరుగుతున్న ఘటనలే నిదర్శనం

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యువకులు హద్దులు దాటుతున్నారు. ఉద్రేకాలను అణచుకోలేక విపరీత పరిణామాలకు కారణమతున్నారు. ఆవేశంలో ఎంతటి ఘోరమైన చేయడానికి వెనుకాడటం లేదు. ఇటీవల జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

● వారం రోజుల కిందట హిందూపురం మండలం పారిశ్రామికవాడ ప్రాంతంలో రెండు గ్రామాలకు చెందిన యువకులు క్రికెట్ ఆడుతూ గొడవపడి, కొట్టుకున్నారు. ఓ యువకుడు తనవద్ద రివాల్వర్ ఉందని తూటాలు కూడా ఉన్నాయని కాల్చేస్తానంటూ హెచ్చరించాడు. ఈ ఆడియో వైరల్ కావడంతో అప్‌గ్రేడ్ సీఐ రెండు వర్గాల యువకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

● పట్టణంలోని శ్రీకంఠపురంలో ఆరు రోజుల కిందట రాత్రి 10గంటల సమయంలో కేక్ కోసే విషయంపై గొడవ పడ్డారు. అక్కడ గట్టి గట్టిగా అరుస్తుండగా పోలీసులు చేరుకుని సర్దిచెప్పి వెను తిరుగుతుండగా పోలీసు వాహనంపైనే రాళ్లు రువ్వారు. ఈ ఘటనకు సంబంధించి ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని ముగ్గురికి సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

● పది రోజుల కిందట ఓ గ్రామంలో జరిగిన కార్యక్రమం సందర్భంగా రెండు వర్గాల యువకులు గొడవ పడుతుండగా పోలీసులు విడిపించడానికి వెళ్లారు. అయితే వారిపైనే తిరగబడ్డారు. వారిని కూడా స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.



● ఇటీవల జరిగిన పండుగ సందర్భంగా టూటౌన్ పరిధిలో యువకులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవపడ్డారు. ఈ సందర్భంలో ఓ యువకుడు కొంతమందిపై దాడికి యత్నించగా పోలీసులు చెదరగొట్టారు. ఆ వ్యక్తిపై గతంలో కొన్ని కేసులు కూడా ఉన్నాయి. పోలీసులు అక్కడకు చేరుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఇవన్ని కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి ఇటీవల కాలంలో చాలా జరుగుతూనే ఉన్నాయి.

ఒకప్పుడు యువత తప్పుచేయాలంటే ఎవరేమంటారోనని భయపడేవారు. ఇటీవల కొంతమంది యువత చెడు వ్యసనాలకు బానిసలై తప్పటడుగులు వేస్తున్నారు. ఆవేశంతో గొడవలకు దిగుతున్నారు. అడ్డదారులు తొక్కుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దీంతో తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారు. చదువుకున్న యువత కూడా ఇలాంటి గొడవల్లో ఉండటం, వారిపై కేసులు నమోదు కావడం గమనార్హం.

కేసు నమోదైతే అంతే..

బంగారు భవితకు బాటలు వేసుకునే సమయంలో కొంతమంది యువత చెడు మార్గంలో పయనించడం, మద్యానికి బానిసలై చిన్న చిన్న విషయాలకు గొడవ పడి స్టేషన్‌వరకు వెళుతున్నారు. కేసులు నమోదై వాటినుంచి బయటపడలేక నానా తంటాలు పడుతున్నారు. ఒక్కసారి కేసు నమోదైతే విద్యార్థులకు ఉద్యోగ సమయంలో లేదా విదేశానికి వెళ్లాలంటే పోలీసుల నుంచి ఎన్‌ఓసీ కావాల్సి ఉంటుంది. గొడవలకు దిగే యువతకు పోలీసులు ఎంతమాత్రం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను ఇవ్వరు. దీనివల్ల ఎంత చదివినా ఉద్యోగాలకు వెళ్లలేరు. దీనిని యువత గ్రహించాల్సి ఉంది.

జీవితాలు నాశనం చేసుకోవద్దు: మహేష్, డీఎస్పీ, హిందూపురం



ఇటీవల కాలంలో విద్యార్థులు చిన్న చిన్న విషయాలకు గొడవకు దిగడం పరిపాటిగా మారింది. దీనివల్ల ఒక్కసారి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైతే వారి నుంచి బయటపడేందుకు చాలా సమయం పడుతుంది. అలాంటివారు ఉద్యోగాలు సంపాదించడం చాలా కష్టంగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కోపాలకు పోయి విలువైన జీవితాలు నాశనం చేసుకోవద్దు. ముఖ్యంగా క్రికెట్ ఆడేటప్పుడు, పల్లెల్లో శుభకార్యాలు, జాతర జరిగే సమయంలో గొడవలు సహజం. చట్టాలు తెలుసుకుని యువత నడుచుకుంటే భవిష్యత్తు బాగుంటుంది.

ఏపీని నంబర్-1 చేస్తాం

- జోడుగుర్రాల్లా అభివృద్ధి, సంక్షేమం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్-1గా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. గోరంట్లలో రూ.80లక్షలతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.50 లక్షల చెక్కు, ఐదెకరాల పొలం, ఆరు సెంట్ల స్థలానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ వేధింపులు తాళలేక రాష్ట్రం నుంచి తరలిపోయిన పరిశ్రమలను ఒక్కొక్కటే వెనక్కు తీసుకొస్తున్నా మన్నారు. తమ పార్టీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటే అమలు చేస్తున్నామన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లో సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామ న్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పథకం అందుతుందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేస్తున్నామన్నారు. ఈనెల 21నుంచి అన్నదాత సుఖీభవ అమలు అవుతుందన్నారు. మద్యం కేసు విషయంలో ప్రభుత్వ జోక్యం ఏ మాత్రం లేదన్నారు. ఆది నుంచి శవరాజకీయాలు చేయడం, వైసీపీ కార్యకర్తలతో రెచ్చగొట్టడం మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అలవాటేనని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

నీటి నిల్వకు ఏమేం చేస్తున్నారు..?

సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల ఆరా

నేడు క్షేత్రస్థాయిలో పర్యటన

6

మోదీ పాలన సువర్ణాధ్యాయం

రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ

పుట్టపర్తిరూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భారత ప్రధానిగా నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన దేశంలో సువర్ణాధ్యాయమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ఆర్వీజే కల్యాణమండపంలో మంగళవారం మోదీ సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మేధావుల సమావేశం నిర్వహించారు. ఎంపీ పాకా వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ.. సరిగ్గా 11 ఏళ్ల క్రితం భారత ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయడంతో దేశంలో నవశకం ప్రారంభమైందన్నారు. నరేంద్ర మోదీ సాహసోపేత నిర్ణయాలు, సంక్షేమ విధానాలతో దేశ దశ, దిశ మారిపోతున్నాయన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ వేదికపై చాటడంలో తీసుకున్న 11 అతిపెద్ద నిర్ణయాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాష్ట్ర కల్లుగీత సమాఖ్య కన్వీనర్, లాయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

అర సెంటు స్థలం కోసం..

ఓ వృద్ధురాలి పోరాటం

16 ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ

కోర్టు ఉత్తర్వులున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు



రొద్దం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తన స్థలానికి హద్దులు చూపాలని రెవెన్యూ, సర్వే అధికారులను 16 ఏళ్లుగా వేడుకుంటున్నా కనికరించడం లేదని దొడగట్ట గ్రామానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు ఇమాంబి ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వంగా తన తాత, ముత్తాతల నుంచి వచ్చిన అరసెంటు స్థలాన్ని దాయాదులు కాజేయడానికి యత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధురాలు ఇమాంబికి సర్వే నంబరు 228లో వారసత్వంతో సంక్రమించిన అరసెంటు స్థలంలో పడిపోయిన ఇల్లు ఉంది. 2008లో రెవెన్యూ అధికారులు ఇంటిపట్టాను ఇమాంబి పేరుతో మంజూరు చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రయత్నించడంతో దాయాదులు అడ్డగించారు. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు 2009లో ఇమాంబికి అనుకూలంగా వచ్చింది. తన స్థలం సర్వే చేసి, హద్దులు చూపాలని అప్పటి నుంచి ఇప్పటిదాకా రెవెన్యూ, సర్వేయర్ల చుట్టూ తిరిగి అలసిపోయినట్లు తెలిపారు. తన భర్త, కుమార్తె చనిపోయారని ప్రస్తుతం తాను ఒక్కదాన్నే ఉన్నానని దాయాదులు దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకంటూ ఓ చిన్న ఇల్లు కట్టుకుని అందులో జీవించాలన్నదే తన చిరకాల కోరిక అన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, సర్వే, పోలీసు అధికారులు న్యాయం చేయకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయంపై తహసీల్దార్ ఉదయ్‌శంకర్ రాజును వివరణ కోరగా ఆ విషయం ఇప్పటిదాకా తన దృష్టికి రాలేదని, అయినా సర్వే చేయించి ఆ వృద్ధురాలికి న్యాయం చేస్తానన్నారు.

అన్నదాతకు అండ

- అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్ కింద ఏటా రూ.20వేలు
- జిల్లాలో 2,58,561 మంది ఎంపిక
- 20న తొలివిడత నగదు జమ


కొత్తచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అన్నదాతా సుఖీభవ పథ కం కింద చిన్న, సన్నకారు రైతులకు పంట పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.14 వేలు, పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.6వేలు అందజేయనున్నాయి. మొత్తంగా ఏడాదికి రూ.20 వేలు రైతుకు అందనుంది. జిల్లాలో 2,58,561 మంది రైతులు ఎంపికయ్యారని వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా తుది జాబితాను విడుదల చేసింది. రైతు సేవాకేంద్రాల్లో అర్హులతో ఈకేవైసీ ప్రక్రియ చేపడుతోంది. ఇంకా 7,300 ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందని వ్యవసాయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

20న తొలి విడత సొమ్ము

కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమచేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి, రెండో విడతల్లో రూ.5వేలు చొప్పున, మూడో విడత కింద రూ.4వేలు రైతుకు అందించనుంది. తొలి విడత ఈనెల 20వతేదీన పీఎంకిసాన్ రూ.2వేలు, అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.5వేలు మొత్తం రూ.7 వేలు రైతుఖాతాల్లో జమకానుంది. అర్హత ఉండి అన్నదాతాసుఖీభవ, పీఎం కిసాన్ జాబితాలో పేరులేని అన్నదాతలు రైతు సేవా కేంద్రాల్లో వివరాలను అధికారులకు అందించాలని వ్యవసాయ శాఖ వర్గాలు సూచిస్తున్నాయి.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏడీజే

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో న్యాయాధికారులతో కలిసి న్యాయవాదులు, పోలీసులతో ఆమె మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీజే మాట్లాడుతూ కక్షిదారులను ఒప్పించి రాజీ అయ్యే కేసులన్నీ పరిష్కారం అయ్యేలా, క్రిమినల్ కేసులు సాధ్యమైనంత ఎక్కువగా పరిష్కారమ య్యేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. న్యాయవాదులు చెక్‌బౌన్స్, భరణం, వివాహ సంబంధిత కేసులు, సివిల్ కేసులు కూడా పరిష్కరిం చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్, అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి లక్ష్మీహారిక, ప్రత్యేక న్యాయాధికారి రమణయ్య, డీఎస్పీ మహేష్, ఏపీపీ ఇందాద్, నగేష్, న్యాయవాదులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

26న మడకశిరలో మెగా జాబ్‌మేళా



పోస్టర్లను విడుదుల చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, ఈనెల 26న మరోసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. జగన్ పాలన వల్ల రాష్ట్రంలో యువత భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని విమర్శించారు.

20న కదిరిలో...

కదిరి, జూన్17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ స్మిత, నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ హరికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేళాకు అనంతపురం, కడపతోపాటు పలు ప్రాంతాల్లోని కంపెనీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. 18నుంచి 33 సంవత్సరాల లోపు వయసు ఉండి, 10, ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్నవారు మేళాకు హాజరుకావాలన్నారు.

సూపర్ సిక్స్..!

ఒక్కొక్కటిగా అమలవుతున్న పథకాలు

కూటమి పార్టీ శ్రేణుల్లో పెరిగిన జోష్

నైరాశ్యంలో కూరుకుపోయిన వైసీపీ

ఉనికి కోల్పోతామేమోనన్న అభద్రతలో కేడర్

7

అక్రమార్కులపై చర్యలేవీ?

వైసీపీ హయాంలో రెచ్చిపోయిన

పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు

ఆ పార్టీ నేతలు చెప్పిందే శాసనంగా విధులు

అడ్డగోలుగా అక్రమాలు... విచారణలో బట్టబయలు

నివేదికలు బుట్టదాఖలు

క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం

ఈఈ నాగమోహన్, ఏఈఈ ప్రతాప్‌కు చార్జి మెమోలు

ధర్మవరంలో ప్రైవేటు భూమిలో రోడ్డు నిర్మాణంపై వివాదం

ధర్మవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్థలంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగమోహన్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రతాప్‌పై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ధర్మవరం మున్సిపాలిటీలో గతంలో పనిచేసిన ఇద్దరు ఇంజనీర్లపై క్రమశిక్షణ చర్యలకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ రంగం సిద్ధం చేసింది. టీడీపీ హయాంలో ధర్మవరం దర్గా సమీపంలో చేపట్టిన మున్సిపాలిటీ రోడ్డు పనులు వివాదాస్పదమయ్యాయి. ఆ స్థలం ప్రైవేటు వ్యక్తులది కావడంతో అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విజిలెన్స్ అధికారులు విచారించారు. ఆ పనులన్నీ ప్రైవేటు భూముల్లో చేపట్టినట్లు నిర్ధారించారు. గత ఏడాది జనవరి 23న ప్రభుత్వానికి విజిలెన్స్ అధికారులు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక గత నెల 23న రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు చేరింది. దీంతో బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంలో భాగంగా ఇద్దరు ఇంజనీర్లకు చార్జ్ మెమోలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం జీఓ 559 జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగమోహన్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రతాప్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని అందులో పేర్కొన్నారు. ఇద్దరు అధికారులు 15 రోజుల్లోపు లిఖిత పూర్వకంగా సమాధానం చెప్పాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఆత్మహత్య కాదు.. హత్యే

భార్యపై అనుమానంతోనే... నిగ్గుతేల్చిన పోలీసులు



నిందితున్ని అరెస్టు చూపుతున్న డీఎస్పీ, సీఐలు

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య కేసు హత్యగా నమోదు చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. కేసు వివరాల ను మంగళవారం ఆయన విలేకరులకు వెల్లడించారు. లేపాక్షి మండలం నాగానపల్లికి చెందిన ఆదినారాయణప్ప భార్య సవిత ఈనెల 4న రాత్రి పది గంటల సమయంలో ఇంటిపక్కనే ఉన్న గొర్రెల షెడ్డులో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని భర్త తన అత్తమామల (సవిత తల్లిదండ్రులు)కు చెప్పాడు. దీంతో వారు పులమతి నుంచి నాగానపల్లికి వెళ్లారు. అయితే సవిత అప్పటికీ కొన ఊపిరితో ఉందని 108కు సమాచారం ఇచ్చారు. ఎంతసేపటికీ రాకపోవడంతో వేరే వాహనంలో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె మృతిపై అనుమానంతో విచారణ చేపట్టారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా భర్తను అదుపులోకి తీసుకున్న సీఐలు జనార్దన్, ఆంజనే యులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. దీంతో తానే తన భార్యను హత్య చేసినట్లు ఆదినారాయణప్ప ఒప్పుకున్నాడన్నారు. వేరే వ్యక్తితో చనువుగా ఉందనే అనుమానంతో భర్త ఈనెల 4న రాత్రి 10గంటల సమయంలో వెనుకవైపు నుంచి వెళ్లి భార్య మెడకు చీరతో బిగించాడు. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. అయితే ఆ చీర రేకులషెడ్డు పైకప్పునకు కట్టి భార్య బంధువులకు ఆత్మహత్య చేసుకుందని సమా చారం ఇచ్చా డు. వారు వచ్చి చూసి నిజమేననుకున్నారు. అయితే ఆ చీర ఎక్కడా గుంటివేసినట్లుగాని ముదిరినట్లుగాని మెడ బిగిసిపోయినట్లు కానీ లేకపోవడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో విషయం వెలుగు చూసింది. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

తప్పిన గుంతల తిప్పలు..!

దెబ్బతిన్న ప్రధాన రహదారి (గతంలో..)



మడకశిర, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం మీదుగా వెళ్లే 544ఇ జాతీయ రహదారిపై ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తేవారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఉండేవి. వాటిలో వాహనాలు తరచూ పడిపోతుండేవి. చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు నుంచి ఈ రహదారి కర్ణాటకలోని శిర వరకు వేశారు. ఈ రోడ్డులో భారీ వాహనాలు వెళ్లేవి. దీంతో రోడ్డు ఛిద్రమై ప్రయాణమంటేనే జంకేవారు. గత ప్రభుత్వం మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఐదేళ్లు నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో రోడ్డులో ఏర్పడిన గుంతలు కాస్తా.. గోతుల్లా మారిపోయాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఈ రహదారి మరమ్మతులపై దృష్టి పెట్టింది. మడకశిర పట్టణ పరిధిలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు పనులు, డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.16 కోట్లతో పనులు చేపట్టింది. మరమ్మతులు పూర్తవడంతో రహదారి రూపురేఖలే మారిపోయాయి. గుంతల బాధలు తప్పాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాక ఇలా..



డీఎస్సీ పరీక్షలు వాయిదా

కొత్తచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాల నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 1, 2 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలు, పరీక్షా తేదీలు మార్చిన హాల్ టిక్కెట్లను https//apdsc.appfas.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని ఆయన సూచించారు.

బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షుడి ఎంపిక


ద్వారకానాథ్ శర్మ

ధర్మవరం, జూన్17(ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం శ్రీసత్యసాయిజిల్లా అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన ద్వారకనాథ్‌శర్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు అఖిల భారతబ్రాహ్మణ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నుంచి ఆదేశాలు వచ్చాయి. తన ఎంపికకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ, రాష్ట్ర ప్రతినిధి అనంతకుమారి, రాష్ట్ర ఏబీవీఎం ఈడీసెల్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నరేశ్‌కుమార్‌లకు ద్వారకనాథ్‌శర్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌పై రేపు అవగాహన

అనంతపురం రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే ఐటీ, పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19న పాలిసెట్-2025 వెబ్ కౌన్సెలింగ్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైభవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు.

నిష్ణాతులైన పాలిటెక్నిక్ ప్రొఫెసర్లు.. ధ్రువపత్రాల పరిశీలన, వెబ్‌కౌన్సిలింగ్‌లోని సమస్యలు, ఆన్‌లైన్‌లో కళాశాల ఎంపిక, కౌన్సిలింగ్ విధానం వంటి వాటి గురించి వివరిస్తారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుకు హాజరయ్యే వారి కోసం ఆర్టీసీ బస్టాండు నుంచి ఉదయం 9గంటలకు ఉచిత కాలేజీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9848471460, 8886621123, 8886621124, 8886630024 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


డబ్బులు తీసుకునిగానీ వెళ్లేది లేదు..!


బారులు తీరిన మహిళలు.. వంతు వచ్చేందుకు ఎంత సమయం పడుతుందో.. ఏమో..!




నా చదువులకే కదమ్మా..?


ఇది మా విజయం..!


ఎందుకైనా మంచిది.. ఎంచుకుంటూ..!


వచ్చే సంవత్సరం ఇంకో రూ.13 వేలు ఎక్కువగా వస్తాయి కదమ్మా..!

అమ్మ చేతికి సొమ్ము

బ్యాంకులు, పోస్టాఫీసు నుంచి డ్రా

తల్లికి వందనం సొమ్మును డ్రా చేసేందుకు వచ్చే మహిళలతో బ్యాంకులు, పోస్టాఫీసులు కిటకిటలాడుతున్నాయి. అనంతపురం హెడ్ పోస్టాఫీసు వద్ద వందలాది మంది మంగళవారం బారులు తీరారు. తపాలా శాఖ సిబ్బంది వారి ఖాతాలో జమ అయిన నగదు అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ అయిన సొమ్మును చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక బిడ్డ ఉంటే రూ.13 వేలు.. ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురికి రూ.39 వేలు, నలుగురికి రూ.52 వేలు.. ఇలా ఎంత మంది పిల్లలు ఉంటే అంత ఎక్కువ నగదు అమ్మచేతికి అందింది. నగదు సరిగా ఉందో లేదో అక్కడే కూర్చుని మహిళలు లెక్కపెట్టుకున్నారు. ఎవరెవరికి ఎంత వచ్చిందో క్యూలో ఉన్నవారు చర్చించుకుంటూ సందడిగా గడిపారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య


రెండు రోజులైనా జనం తగ్గనేలేదక్కా..! మన వంతు ఎప్పుడొస్తుందో ఏమో..!


ఎంతమంది పిల్లలక్కా..? అందరికీ వచ్చిందా..?

హలో.. రెడీగా ఉన్నారా..?

ఆన్‌లైన్‌లోకి రండి.. వివరాలు చెప్పండి

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం వైద్యం, జూలై 17(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయం వచ్చేందంటే జిల్లా కేంద్రానికి రావాల్సిందే. ఇది ఒకప్పటి పరిస్థితి. కానీ ఇప్పుడు సాకేంతికను అందిపుచ్చుకుని, ఉన్నచోటు నుంచే ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్‌కు హాజరై.. బదిలీ చేయించుకోవచ్చు. ఒక్కో ఉద్యోగి బదిలీ ప్రక్రియ ఒకటి, రెండు నిమిషాల్లోనే పూర్తి అవుతోంది.


కౌన్సెలింగ్ కోసం మెడికల్ కాలేజీలో నిరీక్షిస్తున్న నర్సులు

డీఎంహెచ్‌ఓ, వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్యాలయాల్లో బదిలీలు ఇలాగే జరుగుతున్నాయి. కౌన్సెలింగ్ ప్రారంభంకాగానే.. 'హలో.. రెడీగా ఉన్నారా..? ఆన్‌లైన్‌లోకి రండి..' అని ఉన్నతాధికారులు పిలవగానే ఉద్యోగి వీడియో కాల్‌లో ప్రత్యక్షమౌతున్నారు. తన వివరాలు, బదిలీ ఆప్షన్లు ఇస్తున్నారు. ఈ బదిలీల ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది.

కొనసాగుతున్న ప్రక్రియ

వైద్య, ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో కడప నుంచి అధికారులు జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ట్యూటర్ గ్రేడ్-2, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్, డీపీఎంఓ, ఆఫీస్ సూపరింటెండెట్, రేడియోగ్రాఫర్, పీఎంఓఓ, పీహెచ్‌ఎన్(టీచింగ్), హెడ్‌నర్స్, హెల్త్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్ కేడర్లకు మంగళవారం రాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ, డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్స్, ఎంపీహెచ్‌పీఎస్(ఫిమేల్), పీహెచ్‌ఎన్(నాన్ టీచింగ్), జూనియర్ అనలిస్ట్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, ఎంపీహెచ్‌పీఎస్(మేల్), సీనియర్ అసిస్టెంట్,ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్-2 ఉద్యోగులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.


జూమ్ కాన్ఫరెన్స్ ద్వాఆ బదిలీలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

122 ఏఎన్ఎం పోస్టులకు..

ఉమ్మడి జిల్లాలోని 122 సబ్‌సెంటర్లలో 122 ఎంపీహెచ్‌పీఎస్-ఫిమేల్(ఏఎన్ఎం) పోస్టులకు బుధవారం బదిలీల ప్రక్రియ నిర్వహిస్తారు. అయితే ఏఎన్ఎం ట్రైనింగ్ సెంటర్‌లో వార్డెన్, తోపుదుర్తి, మరూరు సబ్‌సెంటర్స్‌లో ఏఎన్ఎం పోస్టులను ఖాళీలు చూపలేదు. రాష్ట్ర వైద్య, ఆర్యోశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లియర్ వేకెన్సీస్ కేటగిరిలో చేర్చడంలేదని డీఎంహెచ్‌ఓ ఆదేశాల్లో పేర్కొన్నారు.

అండర్-19 మహిళా క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా అండర్-19 మహిళా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-19 మహిళా క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ప్రకటించారు. జట్టులో నేహ, హిమవర్షిణి, రోషనారా, ఛాయాశ్రీ, స్వాతి, గీతిక, గౌతమి, హన్సిరెడ్డి, ధారామోహన్, అమూల్య, నందిని, తేజశ్విని, మైత్రి, చక్రిక, ఎస్‌కే తరుణం, స్టాండ్‌బైలుగా మాన్విత, భువనేశ్వరి, యావన, నాగజ్యోతి, చైత్ర, స్రవంతి, హుస్నా హజిరా చోటు దక్కించుకున్నారు. కోచ్‌గా నజీర్‌అహ్మద్ నియమితుడయ్యారు. ఎంపికైన జట్టు ఈనెల 19వ తేదీ నుంచి నెల్లూరులో నిర్వహించే సౌత్‌జోన్ అండర్-19 క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని భీమలింగారెడ్డి తెలిపారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

● సహజ వ్యవసాయమే మార్గం ● కరువు, ఎడారీకరణ నివారణ అత్యవసరం ● వక్తల పిలుపు


రైతులు ఏర్పాటు చేసిన సేంద్రియ పండ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్17(ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందనీ, అందుకు సహజ వ్యవసాయమే మార్గమని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ కరువులు, ఎడారీకరణ నివారణ దినం సందర్భంగా మంగళవారం స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కరువు-వాతావరణ మార్పులు-ప్రకృతి వ్యవసాయం ప్రదర్శన సదస్సు నిర్వహించారు. డీఆర్వో మలోల మాట్లాడుతూ.. రైతులు, జిల్లా ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరమన్నారు. సహజ వ్యవసాయంతో అటు నేల, ఇటు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అభివృద్ధి పర్యావరణానికి హాని కలిగించేవిధంగా ఉండకూడదన్నారు. వాతావరణాన్ని కాపాడేదిగా ఉండాలని వివరించారు. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడానికి, వాతావరణంలో వస్తున్న మార్పులను తిప్పికొట్టడానికి సహజ వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా రసాయన ఎరువులు, కలుపు మందులు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని దెబ్బతీశామన్నారు. మట్టిలోకి రసాయనాలు చేరడంతో ఆహారధాన్యాల ఉత్పాదకత దెబ్బతింటోందన్నారు. ఈ కారణంగా తలెత్తుతున్న అనేక అనారోగ్య సమస్యలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం రైతులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపాల్ విజయశంకర్ బాబు, రైతు సాధికార సంస్థ అధికారి లక్ష్మానాయక్, వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీరెడ్డి, రెడ్స్ డైరెక్టర్ భానూజ, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్రహ్మణ్యం, మిల్లెట్స్ మాధవీలత, రైతులు పాల్గొన్నారు.

నీటి నిల్వకు ఏమేం చేస్తున్నారు..?

సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల ఆరా

నేడు క్షేత్రస్థాయిలో పర్యటన

అనంతపురం అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలశక్తి అభియాన్ పనుల గురించి సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్ విచారించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు ముందుగా కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి, పలు అంశాల గురించి మంగళవారం చర్చించారు. డ్వామా పీడీ కార్యాలయంలో జలశక్తి అభియాన్ పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను సాయంత్రం సందర్శించారు. నీటిని నిల్వ కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను కమిటీ సభ్యులకు డ్వామా పీడీ సలీం బాషా, వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి వివరించారు. వాటర్ షెడ్, ఉపాధి పథకం ద్వారా చేపట్టిన అమృత్ సరోవన్ నీటి కుంటలు, ఫాం పాండ్స్ డ్రైల్యాండ్ హార్టికల్చర్, పశువుల నీటి తొట్టెలు, గొర్రెలు, మేకల షెడ్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా, వాటర్ షెడ్, కృషి విజ్ఞాన కేంద్రం, ఏపీఎంఐపీ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్షేత్రస్థాయి పర్యటన

సెంట్రల్ వాటర్ కమీషన్ కమిటీ సభ్యులు బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను బుధవారం ఉదయం 10.15 గంటలకు పరిశీలిస్తారు. చెక్ డ్యాంల పరిశీలన, చిజిల్ నాగలితో లోతు దుక్కి చేయడాన్ని పరిశీలిస్తారు. అనంతరం రైతులతో మాట్లాడతారు. తాడిపత్రిలో మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని 12 గంటలకు పరిశీలిస్తారు. ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాం పాండ్స్‌ను మధ్యాహ్నం 12.30 గంటలకు పరిశీలిస్తారు. గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫాం పాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని మధ్యాహ్నం 3.30 గంటల నుంచి పరిశీలిస్తారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను ఆ రోజు మధ్యాహ్నం పరిశీలిస్తారు.


వాటర్ షెడ్, ఉపాధి పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్

డ్వామా ఏపీఓల బదిలీ

అనంతపురం అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొమ్మిది మంది డ్వామా ఏపీఓలను బదిలీ చేశారు. ఈ మేరకు డ్వామా పీడీ సలీం బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారి వివరాలు ఇవి..

ఏపీఓ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
తులసీ ప్రసాద్	ఉరవకొండ	పుట్లూరు
సుజాత	పుట్లూరు	ఉరవకొండ
విమల	గుంతకల్లు	వజ్రకరూరు
లక్ష్మీకాంతబాయి	వజ్రకరూరు	బొమ్మనహాళ్
భాగ్యలక్ష్మి	బొమ్మనహాళ్	శింగనమల
ఓబిరెడ్డి	కుందుర్పి	యల్లనూరు
రవి	యల్లనూరు	రాయదుర్గం
విజయభారతి	రాయదుర్గం	పెద్దవడుగూరు
మల్లీశ్వరి	శింగనమల	విడపనకల్లు

దాణాను సద్వినియోగం చేసుకోండి: మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పశుదాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత సూచించారు. పట్టణంలోని పశువైద్య శాఖ కార్యాలయంలో జేడీ శుభదాస్, ఏడీ శ్రీరాములు నాయక్‌తో కలిసి రైతులకు మంగళవారం పశుదాణా పంపిణీ చేశారు. ప్రొటీన్లు పశువులకు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రైతులకు దాణా అందిస్తోందని తెలిపారు. పెనుకొండ మండలానికి 197 దాణా ప్యాకెట్లు కేటాయించామని, ఒక్కో ప్యాకెట్టు విలువ రూ.1100 కాగా సబ్సిడీతో రూ.550కే ఇస్తున్నామని తెలిపారు.

విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధన

రాయలసీమ యూనివర్సిటీ మునుపటి వీసీ నరసింహులు


సదస్సులో పాల్గొన్న వీసీ, డైరెక్టర్లు

అనంతపురంరూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధనలు సాగించాలని రాయలసీమ యూనివర్సిటీ మునుపటి వీసీ ఆచార్య నరసింహులు అన్నారు. స్థానిక జేఎన్‌టీయూలో మంగళవారం జాతీయ విద్యావిధానంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆచార్య నరసింహులు మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో అధ్యాపకులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కోర్సులు ఎంచుకునే సౌలభ్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాలి, సుబ్బారెడ్డి, సుజాత, పద్మసువర్ణ, కిర్మయి, నాగప్రసాద్‌నాయుడు, దుర్గాప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, చిత్ర శోభాబిందు, సురేష్‌బాబు, శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

కవితా పోటీల విజేతల వెల్లడి


సౌరపు గోవిందరాజులు, సత్యనారాయణరాజు, పీజీ వెంకటేష్

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల విజేతల వివరాలను మంగళవారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు టీవీ రెడ్డి వెల్లడించారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని 'ఆర్డీటి సేవలు-అభాగ్యులకు వరాలు' అనే అంశంపై ఈనెల 6 నుంచి 10వతేదీ వరకు వాట్సాప్ ద్వారా కవితలను పోటీలకు ఆహ్వానించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, పుదుచ్చేరి నుంచి 131 మంది తమ కవితలను పంపారు. పోటీలకు జనప్రియ కవి ఏలూరి యంగన్న న్యాయనిర్ణేతగా వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతికి అనంతపురం నగరానికి చెందిన సౌరపు గోవిందరాజులు, ద్వితీయ బహుమతికి విజయవాడ వాసి సత్యనారాయణరాజు, తృతీయ బహుమతికి అనంతపురానికి చెందిన పీజీ వెంకటేష్ కవితలు ఎంపికయ్యాయి. ప్రత్యేక బహుమతులకు చంద్రశేఖరరావు (విశాఖపట్నం), గంగాధర్ (హిందూపురం), పెండేకంటి పార్థసారథి (అనంతపురం), జమున (మహబూబ్‌నగర్), వైరాగ్యం ప్రభాకర్ (కరీంనగర్)ను ఎంపిక చేశారు. విజేతలకు మొమెంటో, నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను కొరియర్‌ద్వారా పంపుతామని టీవీ రెడ్డి వివరించారు.

మెరుగైన సేవలు అందించండి

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు, రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ అధికారులను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశించారు. విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పరిస్థితుల గురించి ఆరా తీశారు. రెవెన్యూ కలెక్షన్లు, విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ల గురించి చర్చించారు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయిన వెంటనే మరొకటి ఏర్పాటు చేయాలని సూచించారు. మరమ్మతులకు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రైతులు, వినియోగదారులను ఇబ్బందిపెట్టవద్దని సూచించారు. లైన్లు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో గుర్తించి, మార్చాలని ఆదేశించారు. నెలవారీ రెవెన్యూ కలెక్షన్లు విధిగా నిర్వర్తించి, సంస్థ పురోగతికి సహకరించాలని కోరారు. సమావేశంలో అనంతపురం జిల్లా ఎస్ఈ శేషాద్రి శేఖర్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వినతులు...

సీఎండీ సంతోష్‌రావుకు పలువురు ఉద్యోగులు తమ సమస్యలను వివరించి, వినతిపత్రాలను సమర్పించారు. విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాము తదితరులు సీఎండీని కలిశారు. జిల్లాల పునర్విభజన కారణంగా 2022 డిసెంబరులో అనంతపురం నుంచి 57 మందిని అక్రమంగా పుట్టపర్తికి బదిలీ చేశారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బదిలీలు చేపట్టాల్సి ఉండగా, అప్పటి అధికారులు కేవలం అనంతపురం సర్కిల్ పరిధిలోని వారిని మాత్రమే పుట్టపర్తికి బదిలీ చేశారని అన్నారు. ఈ కారణంగా బాధితులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆప్షన్లు ఇచ్చి తమను తిరిగి అనంతపురానికి బదిలీ చేయించాలని కోరారు. మూడు నెలల్లోపు తిరిగి అనంతపురం బదిలీ చేసేలా చర్యలు చేపడతామని సీఎండీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు హర్ష, అల్లాబకాష్, రాము, వెంకటరమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

ట్రాక్టర్ కింద పడి చేనేత కార్మికుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

ధర్మవరం, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో సీఎన్‌బీ కల్యాణమండపం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చేనేత కార్మికుడు ఆంజనేయులు(43) మృతి చెందాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప, స్థానికులు తెలిపిన మేరకు..స్థానిక శాంతినగర్‌కు చెందిన నిమ్మూర్తి ఆంజనేయులు మగ్గాలకు జాకార్డు కడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మండలంలోని గొట్లూరు గ్రామంలో జాకార్డు కట్టడానికి మంగళవారం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో సీఎన్‌బీ కల్యాణమండపం వద్ద ఎదురుగా ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని కిందకు పడ్డాడు. అంతలోనే ధర్మవరం వైపు నుంచి వెనుకగా వస్తున్న ట్రాక్టర్ ఆంజనేయులుపై వెళ్లింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆంజనేయులు మృతి వార్త విని భార్య, పిల్లలు బోరున విలపించారు. మృతుడికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమారులున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నాగలింగ (ఫైల్)

గుంతకల్లు టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లదాసరి పల్లి గ్రామానికి చెందిన రైతు గుండాల నాగలింగ(68) అప్పులబాధ తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు నాగలింగకు 18 ఎకరాల పొలం ఉంది. గత మూడేళ్ల నుంచి బోరు బావి కింద మిరప పంట సాగు చేస్తున్నాడు. పెట్టుబడుల కోసం దాదాపు రూ. 10లక్షలు అప్పు చేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడం, వచ్చినప్పుడు గిట్టుబాటు ధర లేకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని కుటుంబసభ్యులతో తరచూ మథనపడేవాడు. ఈక్రమంలోనే ఇంట్లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి, మంటలు ఆర్పి, 108 వాహనం ద్వారా గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగలింగకు భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈసంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడు..

గుత్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాడిపత్రి రోడ్డు జంగాల కాలనీకి చెందిన ఇంతియాజ్(24) ప్రేమ విఫలమై మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చాంద్ బాషా కుమారుడు ఇంతియాజ్ బీటెక్ పూర్తి చేశాడు. ఓ యువతిని ప్రేమించాడు. ప్రేమ విఫలం కావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి కుటుంబసభ్యులు గమనించి, స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఇంతియాజ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి


గ్రీష్మ (ఫైల్)

గార్లదిన్నె, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని కొప్పలకొండ గ్రామానికి చెందిన గడ్డం గ్రీష్మ (18) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ, నాగవేణి దంపతుల కుమార్తె గ్రీష్మ ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉండేది. కడుపునొప్పి తాళలేక నాలుగు రోజుల కిందట ఈమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి...

అనంతపురం న్యూటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగర పరిధి నేషనల్ పార్కు బ్రిడ్జి వద్ద మంగళవారం మధ్యాహ్నం 50 ఏళ్ల లోపు వయసున్న వ్యక్తి రైలు కిందపడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. తెలుపు రంగు స్లాగ్, బ్రౌన్‌కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వద్ద ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ రఫీ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కటకటాల్లోకి కామాంధుడు...!

అనంతపురం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి చేసి, గర్భవతిని చేసిన కేసులో ఇందిరమ్మకాలనీకి చెందిన మత బోధకుడు మహమ్మద్ ఫయాజ్‌ను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. కొంత కాలం కింద తన వారి యోగక్షేమాలు చూసేందుకు బంధువుల అమ్మాయి(14)ని ఇంటికి తెచ్చుకున్నాడు. ఇటీవల బాలిక పుష్పవతి అయ్యింది. అప్పటి నుంచి ఆమెపై కన్నేశాడు. పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక ఐదున్నర నెలల గర్భం దాల్చింది. ఇటీవల విషయం తల్లికి తెలియడంతో దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బాలికపై లైంగిక దాడి విచారణలో నిర్ధారణైంది. నిందితుడిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు దిశ డీఎస్పీ మహబూబ్‌బాషా పేర్కొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.31వేలు

అనంతపురం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక చీనీ మార్కెట్ మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.31వేలు, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 731 టన్నుల చీనీకాయలు వచ్చాయని ఆయన వివరించారు.

'తుంగభద్ర'కు పెరిగిన ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో డ్యాంకు 14,621 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యాంలో 29.14 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 6.07 టీఎంసీలు మాత్రమే ఉంది. 944 కూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండేదని అధికారులు తెలిపారు.

సూపర్ సిక్స్..!

ఒక్కొక్కటిగా అమలవుతున్న పథకాలు

కూటమి శ్రేణుల్లో పెరిగిన జోష్

నైరాశ్యంలో కూరుకుపోయిన వైసీపీ

ఉనికి కోల్పోతామేమోనన్న అభద్రతలో కేడర్


పాతూరు ప్రభాకర్ జీ పాఠశాలలో తల్లికి వందనం.. కూతుళ్ల సంబరం..!

అనంతపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుం డటం కూటమి పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపుతోంది. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరో వైపు అభివృద్ధి పనులు చేపడుతోంది. ఈ పరిణామాలు కూటమి పార్టీల శ్రేణుల్లో జోష్ నింపుతుండగా, వైసీపీ శ్రేణులను నైరాశ్యంలోకి నెడుతున్నాయి. ఆ పార్టీ నాయకులు ఉనికి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. వైసీపీ అధినేత, వైఎస్ జగన్ మొదలుకొని ఆ పార్టీ దిగువ శ్రేణి నాయకులతోపాటు కార్యకర్తలు ఇప్పటి వరకు తల్లికి వందనం అమలు చేయలేదంటూ... నీకు రూ.15వేలు... నీకు రూ15వేలు.. నీకు రూ.15వేలు అంటూ హేళన చేసేవారు. తాజాగా ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం సొమ్ము వారి తల్లి ఖాతాలోకి జమ చేశారు. దీంతో వైసీపీ శ్రేణుల సెటైర్లు, హేళనలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. మరో మూడు రోజుల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇప్పటికే రైతులతో ఈకేవైసీ పూర్తి చేశారు. అనంత జిల్లాలో 270477 మంది రైతులను అర్హులుగా తేల్చారు. వీరందరి ఖాతాలకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కానుంది. మరోవైపు ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున వారి ఖాతాలకు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.3300 కోట్లు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఆగస్టులో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, ఆయన మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇలా సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటంతో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుండగా... వైసీపీ వ్యవహార శైలితో ఆ పార్టీ గ్రాఫ్ రోజు రోజుకు పడిపోతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఉనికి కోసం వైసీపీ పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పెంపు మొదలుకొని ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, అన్నా క్యాంటిన్ల ద్వారా పేదోడి కడుపునింపేందుకు రూ.5లకే అల్పాహారం, భోజనం అందిస్తోంది. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు, పీ-4 ద్వారా పేద కుటుంబాలకు చేయూత... పరిశ్రమల స్థాపన, తల్లికి వందనం పథకం అమలు చేసింది. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నారు. అతిత్వరలో ఆడబిడ్డ నిధి, ఆగస్టులో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నారు. ఇలా సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫాస్ట్‌తో కూటమి ప్రభుత్వం అమలు చేసి, ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుండటంతో వైసీపీ నాయకులు ఉనికి కోల్పోతామేమోనన్న అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో కొర్రీలు చూపి, ఆరోపణలు, విమర్శలతో కాలం వెల్లబుచ్చుతున్నారు. అధికారంలో ఉన్నాన్నాళ్లు బటన్ నొక్కుడు తప్పా జిల్లా అభివృద్ధికి ఏం చేశారన్న ప్రశ్న వైసీపీ శ్రేణుల నుంచే నాయకులు ఎదుర్కొంటున్న పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఓ వైపు పార్టీ శ్రేణుల నుంచి ఎదురవుతున్న అసంతృప్తులు... మరో వైపు సూపర్ సిక్స్ పథకాల అమలు ఆ పార్టీ ముఖ్యనాయకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అభివృద్ధికి బాటలు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదన్న భావన ప్రజల్లో ఉంది. పరిశ్రమల విషయంలోనూ వైసీపీ ఎలాంటి చొరవ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాకు జీవనాడైన హంద్రీనీవాను అప్పటి సీఎం జగన్, జిల్లా ప్రజాప్రతినిధులుగా ఉన్న నాయకులు సైతం పట్టించుకోలేదన్నది నిర్వివాదాంశం. ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల సంక్షేమాన్ని విస్మరించేలా ఆ వర్గాల కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు. ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారు. ఆ వర్గాలకు చెందిన 22 పథకాలను రద్దు చేశారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా ఉన్న పరిశ్రమలను కమీషన్ కోసం తరిమికొట్టిన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఈ వ్యవహారాలన్నీ ఆ పార్టీకి శాపంగా పరిగణించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే హంద్రీనీవా పనులు పరుగులు పెడుతున్నాయి. రూ.3800 కోట్లు హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులకు కేటాయించడం కరువు జిల్లా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతోంది. కరువు జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ రూ.వేల కోట్ల పెట్టుబడితో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇలా కరువు జిల్లా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధతో వైసీపీ నేతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.త

అక్రమార్కులపై చర్యలేవీ?

వైసీపీ హయాంలో రెచ్చిపోయిన

పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు

ఆ పార్టీ నేతలు చెప్పిందే శాసనంగా విధులు

అడ్డగోలుగా అక్రమాలు... విచారణలో బట్టబయలు

నివేదికలు బుట్టదాఖలు

వైసీపీ హయాంలో అనంతపురం రూరల్ మండలంలో పనిచేసిన ఓ మహిళా కార్యదర్శి అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. ఆమె అవినీతిపై విచారణ కూడా చేయించారు. ఆ తర్వాత అటకెక్కించారు. ఎంచక్కా.. ప్రమోషన్ ఇచ్చి పంపారు.

వైసీపీ హయాంలో అనంతపురం రూరల్ మండలంలో ఎక్కువ కాలం పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు అంతే లేదు. అప్పటి ఉపసర్పంచ్ చెప్పిందే వేదంగా పనిచేశారన్నది బహిరంగ రహస్యమే. భవన నిర్మాణ అనుమతుల్లో వసూళ్ల పరంపర సాగించారు. అభివృద్ధి పనుల్లో అడ్డగోలుగా దోచుకున్నారు. వైసీపీ బంటులా పనిచేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం పోయే పరిస్థితి రావడంతో అప్పుడు గానీ, ఇక్కడి నుంచి వెళ్లలేదు. ఇలా.. గత వైసీపీ హయాంలో చాలామంది పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వం మారినా వారిపై నేటికీ చర్యలు తీసుకోలేదు. విచారణ చేసినా.. నివేదికలు ఏ కాకి ఎత్తుకెళ్లిందో.. ఉన్నతాధికారులే చెప్పాలి మరి..

వైసీపీ హయాంలో బుక్కరాయసముద్రం మండలంలో పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి వైసీపీ నాయకులతో అంటకాగారు. తాను ప్రభుత్వోద్యోగినన్న విషయం మరచి, వైసీపీ నాయకుడిలా వ్యవహరించారు. ఆ పార్టీ నాయకులతో కలిసి రెచ్చిపోయారు. అభివృద్ధి పనులు, నిర్మాణ అనుమతుల్లో వసూళ్ల పర్వం సాగించారు. అక్రమాలు బయటపడడంతో సర్పంచ్‌పై నెపం వేసి, తప్పించుకున్నారు. అక్కడి నుంచి ఆ కార్యదర్శి అనంతపురం రూరల్ మండలానికి వచ్చారు. అధికార పార్టీ అండతో మరింత రెచ్చిపోయారు. ఈయన అక్రమాలపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అప్పటి డీఎల్‌పీఓ విచారణ చేసి, అవినీతిని నిగ్గుతేల్చారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. వాటిని బుట్టదాఖలు చేశారు. తమకు అనుకూలమైన అధికారి ద్వారా మళ్లీ విచారణ చేయించి, అంతా బాగుందన్నట్లు నివేదిక ఇప్పించుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ పంచాయతీ కార్యదర్శిని పక్క జిల్లాకు బదిలీ చేశారు. ఇటీవల బదిలీల్లో ఆ అధికారికి అందలం దక్కింది. మళ్లీ అనంతపురం రూరల్ మండలానికి రావాలని ప్రయత్నించారు. కుదరకపోవడంతో గార్లదిన్నె మండలానికెళ్లారు.

అనంతపురం న్యూటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు హద్దు మీరారన్నది బహిరంగ రహస్యమే. ఆ పార్టీ నాయకులు చెప్పిందే శాసనంగా అమలు చేశారు. వారి అండతో చెలరేగిపోయారు. అభివృద్ధి పనుల్లో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. ఉన్నతాధికారులపై సైతం ఆధిపత్యం చెలాయించారు. వారి అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టారు. అందులో అవినీతి బట్టబయలైంది. దీంతో విచారణ నివేదికలనే బుట్టదాఖలు చేశారు. నేటికీ చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

ఆ మండలాల్లో విపరీతం

వైసీపీ ప్రభుత్వంలో అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, రాప్తాడు, పామిడి, పుట్లూరు, యల్లనూరు, ఉరవకొండ, కణేకల్లు మండలాల్లో పనిచేసిన పలువురు కార్యదర్శుల మాటకు ఎదురులేదన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ప్రచారం జరుగుతోంది. బుక్కరాయసముద్రంలో అక్రమాలకు హద్దేలేదు. సర్పంచ్‌ను డమ్మీని చేసి, నిధులు మింగేశారు. అక్రమాలను సర్పంచ్‌పైకి నెట్టి, చెక్‌పవర్ రద్దయ్యేలా చేశారు. అనంతపురం రూరల్ మండలంలో పనిచేసిన ఓ సెక్రటరీ స్థానిక నాయకుడి అనుచరుడికి లక్షల విలువచేసే పంచాయతీ స్థలాన్ని కట్టబెట్టినట్లు అప్పటిలో దూమారం రేగింది. వారు అడిగినంత ఇచ్చుకుంటేనే ఇల్లు కట్టుకోవచ్చనీ, లేదంటే ఇబ్బందులు తప్పవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విచారణ ఆపడానికి రూ.లక్షలు..?

అనంతపురం రూరల్ మండలంలోని ఓ మేజర్ పంచాయతీలో రూ.50 లక్షలుపైగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపించాయి. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అక్రమాల పుట్ట బద్ధలైతే ఉద్యోగం ఊడటం తథ్యమని భావించిన ఆ కార్యదర్శి.. ఫిర్యాదిదారుకు లక్షల్లో ముట్టజెప్పి, వాపసు తీసుకునే యత్నాలు సాగించాడన్న ప్రచారం జరుగుతోంది. వీటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

బదిలీల్లో తప్పిదాలను సరిదిద్దాలి

డీఈఓకు ఎస్టీయూ నాయకుల వినతి

అనంతపురం విద్య, జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో చోటుచేసుకున్న తప్పిదాలను సరిదిద్దాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గుంతకల్లు, గుత్తి ప్రాంతాల్లో తలెత్తిన తప్పిదాలను డీఈఓకు వివరించి, వాటిని పరిదిద్దాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

నెట్టికంటి హుండీ ఆదాయం రూ.81.83 లక్షలు

గుంతకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.81.83 లక్షల ఆదాయం లభించింది. దేవదాయ శాఖ పరిశీలకుల సమక్షంలో మంగళవారం హుండీలను తెరిచి, అందులో భక్తులు వేసిన విరాళాల సొమ్మును లెక్కగట్టారు. గత 83 రోజులకుగాను ప్రధాన హుండీల ద్వారా రూ.81.39 లక్షలు, అన్నదానం హుండీల ద్వారా రూ.44,173 కలిపి మొత్తం రూ.81.83 లక్షల ఆదాయం సమకూరింది. హుండీల్లో భక్తులు 14.1 గ్రాముల బంగారం, 2.96 కేజీల వెండి వేసినట్లు తేలింది. 10 విలువ కలిగిన అమెరికన్ డాలరును సమర్పించుకున్నారు. భక్తులు 83 రోజుల్లో హుండీలో వేసిన మొత్తాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, వలంటీర్లు పాల్గొన్నారు.


కసాపురం ఆలయంలో హుండీ సొమ్మును లెక్కిస్తున్న దృశ్యం

గాలివాన బీభత్సం

మర్తాడులో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు


మర్తాడులో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు

గార్లదిన్నె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లదిన్నె, మర్తాడు, యర్రగుంట్ల, సంజీవపురం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం గాలి, వాన బీభత్సం సృష్టించింది. మర్తాడు గ్రామం లో ఇళ్లకు సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు పడిపోవడంతో పాటు మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఇళ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలను మార్చి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించిన ఏ మాత్రం పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

20న బ్యాంకు ఉద్యోగాలకు మేళా

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో పోస్టుల భర్తీకి ఈనెల 20వ తేదీన స్థానిక ఏఎఫ్ ఎకాలజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదివి 18 నుంచి 26 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆన్‌లైన్ బ్యాంకింగ్ ప్రొ కోర్సులో శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో 20వతేదీన హాజరుకావాలన్నారు. వివరాలకు 8121717846 నంబరులో సంప్రదించాలని కోరారు.

అనుమానంతో భార్యపై దాడి

చికిత్స పొందుతూ మృతి

రాప్తాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త.. అనుమానంతో దాడి చేయడంతో భార్య మృతిచెందింది. రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన సాకే నరసింహులు, సాకే పద్మావతి దంపతుల కుమార్తె నందిని 9 ఏళ్ల క్రితం అనంతపురం టౌన్ నవోదయ కాలనీకి చెందిన పోకుల విజయ్‌కుమార్‌ను కులాంతర ప్రేమ వివాహం చేసుకుంది. తరువాత వారు రాప్తాడులో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నారు. విజయ్‌కుమార్ పెళ్లిళ్లకు డెకరేషన్ చేసే పనులకు వెళ్లేవాడు. ఈనెల 16న రాత్రి 9 గంటల సమయంలో విజయ్‌కుమార్ అనుమానంతో భార్య నందిని తలపై బలంగా కట్టెతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను సోమవారం రాత్రి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందింది. నందిని తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి, జూన్17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మరణించాడు. స్థానిక సీబీ రోడ్డులో పడి ఉన్న అతడిని ఈనెల 16న అంబులెన్స్ ద్వారా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు చనిపోయాడని పట్టణ పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసై అనారోగ్యం బారినపడి మృతిచెందాడని వారు భావిస్తున్నారు.

చదువుల తల్లికి పెళ్లి చేసే యత్నం..!

పదో తరగతి టాపర్‌కు నిశ్చితార్థం

నార్పల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయాలని నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. బాలిక పదోతరగతి చదివేటపుడే మేనమామతో వివాహం చేయాలనుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినిని కళాశాలలో చేర్చకపోవడంతో టీచర్లకు అనుమానం వచ్చి తల్లిదండ్రులను విచారించారు. బాల్య వివాహం చేయవద్దనీ, కళాశాలలో చేర్పించాలని నచ్చజెప్పారు. ఇప్పటికే బాలికకు నిశ్చితార్థం చేసినట్లు తెలిసింది. ఏగుడి దగ్గరికో వెళ్లి వివాహం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఐసీడీఎస్, పోలీసు అధికారులు.. ఈ బాల్యావివాహాన్ని అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ



పాడిరైతులకు పౌష్టికాహారం అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె

అమడగూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి పశువుల కోసం సబ్సిడీతో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని మండల పరిధిలోని మహమ్మదాబాద్ పశువైద్య కేంద్రంలో మంగళవారం పంపిణీ చేశారు. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి చేతుల మీదుగా పాడి రైతులకు అందించారు. మండలంలోని పాడి రైతులకు ప్రభుత్వనుంచి 90 బ్యాగులు అందినట్లు పశువైద్యాధికారి ధనుంజయుడు తెలిపారు. మండలంలోని పది పంచాయతీలకు సంబంధించి ఒకొక్క పంచాయతీకి తొమ్మిది బ్యాగులు ఇవ్వనున్నట్లు చెప్పారు. పాడిరైతులకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో అంద జేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, నాయకులు క్రిష్ణమూర్తి, పాల శీన, నాగేంద్ర, క్రిష్ణారెడ్డి, దినేష్‌రెడ్డి, ఆయాజ్, అబ్దుల్‌రవూ్ఫ, డీలర్లు, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి: డీఐఈఓ



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న డీఐఈఓ సయ్యద్‌మౌలా

ధర్మవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతిఏడాది లాగే ఈ ఏడాది కూడా ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా అధ్యాపకులు కృషిచేయాలని డీఐఈఓ సయ్యద్‌మౌలా సూచించారు. ఆయన మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. ముందుగా కళాశాలలోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాలలో బోధన తీరు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థినులకు ఆయనే వడ్డించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వనితావాణి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల కమిటీ సమావేశం

నల్లమాడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల, గ్రామ కమిటీ సమావేశాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. మండలకేంద్రంలోని తన నివాసంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ, మండల కమిటీలు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీలు, అనుబంధ కమిటీలను ఎన్నుకునేందుకు సమా వేశం నిర్వహిస్తున్నారు. అలాగే పార్టీ పరిశీలకులుగా రొద్దం నరసింహులు అధ్యక్షతన మండక కమిటీ ఎన్నికలు జరుగుతా యన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు, స్టోర్ డీలర్లు, ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కమిటీల ఎంపికపై పరిశీలకుడి సమీక్ష



రొద్దం నరసింహులును సన్మానిస్తున్న నాయకులు

నల్లమాడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల పరిశీలకులుగా మంగళవారం మండలానికి వచ్చిన రొద్దం నరసింహులు కమిటీల ఎంపికపై స్థానిక నాయకులతో సమీక్షించారు. టీడీపీ నాయకుడు చిట్టిబాల రాజారెడ్డి నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం నిర్వహించే కమిటీల ఎన్నికల గురించి, నాయకులతో చర్చించారు. మండల కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, గడ్డం రమణారెడ్డి, గుండ్ర శివారెడ్డి, గన్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, పూల రామయ్య, నాయకులు, కార్యకర్తలున్నారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ

గాండ్లపెంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా సయ్యద్ షాదాబ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీప్రియ నల్లచెరువు ఏఓ బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలోకి తలుపుల ఏఓగా పనిచేస్తున్న సయ్యద్ షాదాబ్ బదిలి చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు అందిస్తానని తెలిపారు.

'మహిళా ఉద్యోగులను నియమించాలి'

కదిరి అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రైబల్ ఎక్స్‌లెన్స్ కాలేజీలో మహిళా అధ్యాపకులను నియమించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కదిరి డివిజన్ సభ్యుడు రాంప్రసాద్ మంగళవారం ప్రకటనలో కోరారు. బాలికలు చదువుకుంటున్న కళాశాలలో మహిళలు మాత్రమే విద్యాబోధన చేయాలన్నారు. నాన్‌టీచింగ్‌లో కూడా మహిళలనే నియమించా లని కోరారు. ఈ సమస్యపై పలుమార్లు ట్రైబల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటికైనా కళాశాలలో మహిళలను మాత్రమే నియమించాలని ఆయన కోరారు.

ఘనంగా రక్తదాతల దినోత్సవం



రక్తదాతలను సన్మానిస్తున్న విశ్వదీపా సేవాసంఘం ప్రతినిధులు

ధర్మవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వదీపా సేవాసంఘం కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపకుడు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కా పాడవచ్చన్నారు. అనంతరం అత్యధికంగా రక్తదానం చేసిన వారిని సేవా సంఘం ఆధ్వ ర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు గాజుల సురేశ్, సభ్యులు చంద్ర, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాధవ, జుజూర్ రఘు, నారాయణస్వామి, మధుసూదననాయుడు, భార్గవ, ఆదినారాయణ, సుబ్రహ్మణ్యం, నాగార్జున, కిరణ్ పాల్గొన్నారు.

నత్తనడకన ఆస్పత్రి నిర్మాణం

● నాలుగేళ్లుగా కొనసాగుతున్న భవనం పనులు

● వసతులు లేక రోగులు, డాక్టర్ల అగచాట్లు



నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనం

కదిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మూడు నియోజకవర్గాల ప్రజల వైద్యసేవలకు మూలమైన కదిరి ఏరియా ఆస్పత్రిని భవనాల కొరత పీడిస్తోంది. ముఖ్యంగా ఓపీ విభాగం భవనం లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కదిరి నియోజకవర్గంతో పాటు పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లోని కొన్ని మండలాల ప్రజలు అవసరమైనా, అత్యవసరమైనా ఇక్కడికి రావాల్సిందే. దీనిని 1999లోనే వంద పడకల సామర్థ్యంతో, అన్ని వసతులతో నిర్మించారు. అయితే చాలా ఏళ్ల క్రితం నిర్మించిన కొన్ని ఆస్పత్రి గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో గత వైపీ ప్రభుత్వంలో ఇన్‌పేషెంట్, ఎమెర్జెన్సీ విభాగాలు మినహా మిగతా భవనాన్ని కూల్చివేశారు. నూతన భవన నిర్మాణానికి 2021 మార్చి 27న భూమి పూజ చేశారు. రెండేళ్లలో ఈ భవన నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. కానీ నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్ అర్థాంతరంగా ఆపివేశారు. మధ్యలో అరకొర నిధులు ఇవ్వడంతో కొద్దికొద్దిగా పూర్తి చేశారు. ప్రస్తుతం 80 శాతం పూర్తయింది. నిధులు లేని కారణంగా మిగిలిన 20 శాతం నిర్మాణం ఆగిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కంది కుంట వెంకటప్రసాద్ పలుమార్లు ఈ నిర్మాణాలపై సమీక్షించడంతో కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టినా, నిర్మాణం నత్తనడకనే సాగుతోంది.

ఓపీ వద్ద ఇబ్బందులు

ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న భవనాలను కూల్చివేయడంతో నాలుగేళ్లుగా రోగులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అవుట్ పేషెంట్(ఓపీ) గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ రోజుకు 500మందికి పైగా ఓపీ ఉంటుంది. గతంలో ఉద్యోగుల కోసం నిర్మించిన గదుల్లో ప్రస్తుతం ఓపీ నిర్వహిస్తున్నారు. ఓపీ చీటీలు రాయడానికి ఆరు బయటే ఏర్పాటు చేశారు. ఇక్క రోగులు కూర్చోవడానికి కూడా వసతి లేదు. అలాగే రోగులు ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడాల్సివస్తోంది. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో గదులు లేక అవుట్ పేషెంట్లకు వైద్య పరీక్షలు చేయడానికి నాలుగేళ్లుగా డాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన వెలుతురు లేని ఇరుకు గదుల్లో ఇద్దరు డాక్టర్లు ఉంటున్నారు. ఇక్కడ రోగులు నిలబడేందుకు కూడా చోటు ఉండదు. ఆస్పత్రి ఆవరణంలోనే అన్ని విభాగాల రోగులు ఉండాల్సి వ స్తోంది. దీంతో ఆస్పత్రి ఆవరణమంతా రోగులతో కిక్కిరిసిపోతోంది. అలాగే ఎక్సెరే తదితర ల్యాబ్‌లన్నీ ఒకే చోట చిన్న గదిలో తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. ఇవి వైద్య పరీక్షలకు అనుకూలంగా లేవు.

అపరిశుభ్రంగా ఆస్పత్రి ఆవరణం

భవన నిర్మాణం కొనసాగుతుండడంతో ఆస్పత్రి అంతా అపరిశుభ్రంగా తయారైంది. ఉన్న ప్రహరీ కూల్చివేయడంతో పాటు కంకర, ఇసుక అక్కడే వేయడంతో ఆ ప్రాంతమంతా దుమ్ముధూళితో నిండిపోయింది. ఆసుపత్రిలోని రోడ్డు దెబ్బతినడంతో అత్యవసర విభాగం నుంచి, సాధారణ విభాగానికి స్ట్రెచర్ లేదా వీల్‌చైర్‌లో రోగులను తీసుకెళ్లేందుకు సాహసో పేతంగా ఉందని సిబ్బంది, రోగుల సహాయకులు అంటున్నారు. ఓపీ నుంచి ఇన్‌పేషెంట్ విభాగానికి వెళ్లే దారికూడా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర విభాగం వద్ద కూర్చోవడానికి కూడా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఇసుక, కంకర, కడ్డీలు ఉండడంతో రోగులకు అసౌకర్యంగా ఉంది.



ఆరుబయటే ఓపీ విభాగం

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం

ఆసుపత్రిలో భవన నిర్మాణాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. వచ్చే సోమవారం కూడా ఆసుపత్రి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో చర్చిస్తాం.

- విజయలక్ష్మి, సూపరింటెండెంట్

పుట్టపర్తి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

● సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పట్టణాభివృద్ధిపై కలెక్టర్ టీఎస్ చేతన్‌తో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి పట్టణాన్ని ప్రజలు, దాతల సహకారంతో అత్యంత సుందరంగా తీర్చితిద్దుదామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మంగళవారం పుట్టపర్తి పట్టణ అభివృద్ధిపై స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డితో కలసి జోయాలుకాస్ జ్యువెలరీ ప్రతినిధి జాయ్‌మాత్యూ, టూరిజం, ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. పట్టణంలో ఉన్న ప్రముఖ బిల్డర్లు, బాబా భక్తులు, పలువురు దాతలు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ముందుకురావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పుట్టపర్తిని పర్యాటకంగా అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారు. అందులో భాగంగా బాబా నడియాడిన చిత్రావతి నదీతీరం, పట్టణంలో మౌలిక వసతులతో పాటు, ఫుట్‌పాత్‌లు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలో సాయిభక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ఉన్న 14 పార్కులను పుడా సహకారం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ క్రాంతికుమార్, ఇరిగేషన్, టూరిజం, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

'అన్నదాతా సుఖీభవ'ను ఒకే విడతలో ఇవ్వాలి

● సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు

ముదిగుబ్బ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఇచ్చే సహాయాన్ని మూడు విడతలుగా కాకుండా మొత్తం ఒకే సారి అందించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాసినేని ప్రభాకర్ డిమాండ్ చేశారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా పీఎం కిసాన్‌తో కలిపి ఏడాదికి రూ. 20వేలు రైతులకు అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అందులో భాగంగా మొదటి విడతగా ఈ నెల 20వ తేదీ రైతుల ఖాతాల్లో రూ. 7వేలు జమ చేయనున్న విషయం తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం కూడా రైతు భరోసా పథకం ద్వారా ఇదే తరహాలో ఏడాదికి మూడుసార్లు పరిహారం అందించడం వలన రైతులకు ఆశించినంతగా ఆర్థిక వెసులుబాటు కలగలేదన్నారు. కావున ఒకేసారి పంపిణీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు

ధర్మవరం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లిలో పలు కుటుంబాలు బీజేపీలోకి చేరాయి. గ్రామానికి చెందిన నారాకొండయ్యతో పాటు పలు కుటుంబాలు, కురుబ సామాజిక వర్గానికి చెందిన ఎజ్జేరమేష్, తదితరులు బీజేపీలోకి చేరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మంగళవారం మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు హాజరయ్యారు. వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొట్లూరు చంద్ర, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, అంగజాల రాజు, పోతుల నాగేపల్లి లక్ష్మీనారాయణ, వసంతపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

● ప్రజాసమస్యలపై చర్చించేరా?



మండల పరిషత్ కార్యాలయం

తాడిమర్రి, జూన్17(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన మూడునెలల కాలంలో జరిగిన అభివృద్ధి పనులు రాబోవు మూడునెలల కాలంలో చేపట్టబోయే పనుల వివరాలతో శాఖల వారీగా అధికారులు సమావే శంలో చర్చించాల్సి ఉంటుందన్నారు. కాగా గడచిన ఐదేళ్లలో జరిగిన సమావేశాలలో ఏ సమస్యపైనా స్థానిక ప్రజాప్రతినిధులు చర్చించలేకపోయారంటే... వాటిపై వారి అంకితభావం అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

మండలంలో సమస్యలు ఇలా...

సాక్షాత్తు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఇలాఖాలోని తాడిమర్రి మండలంలో తహసీల్దార్, విద్యుత్‌శాఖ ఏఈ పోస్టులు సంవత్సర కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్‌లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య ఎదురైనప్పుడు మండల నిధుల ద్వారా పరిష్కరించాల్సింది పోయి మిన్నకుండిపోతున్నారు. మండలానికి సంబంధించి వివిధ రకాల పనులు చేపట్టేందుకు రూ. కోటి అంచనా వ్యయంతో నివేదికలు తయారుచేసినా... ఓ అధికారి, ఓ ప్రజాప్రతినిధి కలిసి అవి అప్రూవల్ కాకుండా అడ్డుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. మండల వ్యాప్తంగా 14 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా మండలంలో చివరి చెరువులకు నీరు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న ఆర్ఐ, వీఆర్ఓ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. మండలంలోని ఓ అధికారి తాను మంత్రికి బంధువని చెప్పుకుంటూ తన శాఖను గడ గడలాడిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ సమస్యలపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీ సర్వే సమస్యలన్నీ పరిష్కరించాలని, ప్రభుత్వం అందిస్తు న్న తల్లికివందనం, అన్నదాతా సుఖీభవ పథకాలను అర్హులైన వారికి అందించాలని కోరుతున్నారు.

కంకర పరిచారు... తారు మరిచారు



నక్కరాళ్లతండా నుంచి నడిమికుంటపల్లి వరకు కంకర వేసిన దృశ్యం

తనకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో మండలపరిధిలోని నక్కరాళ్లతండా గ్రామం నుంచి నడిమికుంటపల్లి వరకు, అలాగే గంధోడివారిపల్లి నుంచి గంగమ్మగుడి మీదుగా, కుర్మాలపల్లి వరకు రోడ్ల నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగా ఆయా రోడ్లపై కంకర పరిచారు. ఆ తరువాత పనులు చేపట్టకుండా కంకర పరిచి, అలాగే వదిలేశారు. దానిపై తారు వేయడం మరిచిపోయారు. దీంతో ఆ రోడ్ల రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న బాధలు వర్ణాణాతీతం, గత రెండేళ్లగా కంకర రోడ్డులోనే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఇక ద్విచక్రవాహన దారులు పడే బాధలు అన్నీఇన్నీకావు. ప్రతిరోజు ఎవరో ఒకరు ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే తమ రోడ్ల నిర్మాణాలు చేపడుతారని ఆశించిన గ్రామస్థులకు నిరాశే ఎదురైంది. ఈ ప్రభుత్వం ఏర్పడి యేడాదైనా, ఆ రెండు కంకర రోడ్ల గురించి పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆ కంకర రోడ్లకు తారు వేసి తమకు సౌకర్యవంతమైన ప్రయాణానికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

బీఎల్ఏల జాబితాను వెంటనే ఇవ్వండి

● కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి, వారి జాబితాను వెంటనే అందజేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంట నే బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి, వారి జాబితాను అందజేయాలన్నారు. నియమ నిబంధనలను ఖచ్చితం గా పాటించాలన్నారు. బూత్ లెవల్ అధికారులు సంబంధిత బూత్‌లో ఓటు హక్కు కలిగి ఉండి ప్రభుత్వ ఉద్యోగిగా ఉండాలన్నారు. ఏజెంట్లు కూడా సంబంధిత బూత్‌లో ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొనిరావాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ విజయసారథి, టీడీపీ ప్రతినిధి సామకోటి ఆదినారాయణ, జనసేన పార్టీ ప్రతినిధి అబ్దుల్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు స్థల పరిశీలన



తిమ్మమ్మ మర్రిమాను వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నంబులపూలకుంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 21న నిర్వహించే యోగాదినోత్సవం సందర్భంగా యోగా చేయడానికి మండలాధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మండలంలో తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని నాయకులు, అధికారులు అక్కడ స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. అనంతరం గూటిబైలు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ పార్థసారథి ఎంఈఓ గోపాల్‌నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, సర్పంచ్‌లు విష్ణుమూర్తి, శ్రీనివాసు లు, జూనియర్ అసిస్టెంట్ సురేష్; పంచాయతీ కార్యదర్శి హరి బాబు, ప్రేమశేఖర్, టూరిజం గైడ్ మనోహర్, సీఆర్పీ నగేష్‌నాయక్ పాల్గొన్నారు.

తంబళ్ళపల్లె పరిశీలకుడిగా సోమశేఖర్

పుట్టపర్తిరూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళ్ళపల్లె నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ఎన్నికల పరిశీలకులుగా ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్‌ను రాష్ట్ర నాయకత్వం నియమించింది. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి మంగళవారం తనకు ఉత్తర్వులు ఆయన ఫోన్‌లో తెలియజేశారు. ప్రజాసమస్యలపై రాజకీయ ఆర్థిక సామాజిక అంశాలపై తనకున్న అవగాహనపై పార్టీ తనకు అవకాశం కల్పించిందన్నారు. పార్టీ అప్పజెప్పిన బాధ్యతలను క్రమశిక్షణతో అమలు చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగ్గురికి రిమాండ్

కదిరి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పశువుల లారీ డ్రైవర్‌ను బెదిరించి, డబ్బులు వసూలు చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఆ ముగ్గురు ఈ నెల 15న రాత్రి తమిళనాడుకు చెందిన పశువుల వ్యాన్ డ్రైవర్ మారుదాముత్తును బెదిరించి, అతడి నుంచి రూ. 20వేలు డిమాండ్ చేశారు. వ్యాన్ డ్రైవర్ వారికి రూ. ఆరు వేలు ఇచ్చాడు. అనంతరం ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీ సులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం వెలుగు కార్యాలయం వద్ద ఉన్న నిందితులు ఉత్తన్న, ఆంజనేయులనాయక్, కుళ్లాయ ప్పను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి బొలేరో వాహనం, రూ.5,700 నగదు, రెండు కట్టెలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పరచగా, న్యాయాధికారి వారికి 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'



మొక్క నాటుతున్న అటవీ అధికారి గుర్రప్ప

కదిరిఅర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షిదామని, అది మనందరి బాధ్యత అని కదిరి అటవీశాఖాధికారి గుర్రప్ప పేర్కొన్నారు. హరితనేస్తం నిర్వాహకులు రా యసం హరిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీటీ స్థానిక ఫీల్డు కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాట్టారు. ఈ సందర్భంగా హాజరైన అటవీశాఖాధికారి మాట్లాడుతూ అవకాశ మున్న స్థలంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యత తీసుకో వాలన్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. హరితనేస్తం నిర్వాహకులు ప్రతియేటా ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అటవీశాఖాధికారి ప్రదీప్‌కుమార్, సెక్షన్ అధికారి రామచంద్రారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ఉప్పార్లపల్లిలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నల్లచెరువు, జూన్17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమర్ల పంచాయతీ ఉప్పార్లపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. రహదారికి అనుకుని తక్కువ ఎత్తులో దానిని ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. అందులో దాదాపు 40 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వర్షం పడినా, గాలి వీచినా న్యూట్రల్, ఫేస్ అర్త్ అవడంతో నిప్పు రవ్వలు పడుతున్నాయి. ఈ సమయంలో కింద ఉన్న ఎరువు దిబ్బ అంటుకుని మంటలు చెలరేగే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్, పంచాయతీ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచడంతో పాటు అక్కడ ఉన్న చెత్తచెదారం తొలగించి శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు తీసుకున్న వారితో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ముఖ్యమంత్రి సహాయనిధి పేదవారి ఆరోగ్యాన్ని నిలబెట్టే వారధి అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలసి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 32 మంది లబ్ధిదారులకు రూ. 13.46 లక్షలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. గత వైసీపీ పాలనలో సీఎంఆర్ఎఫ్ అనే పదాన్ని పేదవాడికి దూరం చేశారని విమర్శించారు. పేదవాళ్లు వైద్యం కోసం అప్పులు చేయాల్సిన దుస్థితిని జగన్ ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం దూది, సూది కూడా లేకుండా చేశారని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పేదవారికి మెరుగైన వైద్యం అందించడంతోపాటు సీఎంఆర్ఎఫ్‌ను కూడా సకాలంలో అందించడం జరుగుతోందన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి కార్యక్రమాల చేయలేక పోయారని, కేవలం రాజకీయం కోసమే మడకశిర ప్రాంతాన్ని వాడుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, నియోజకవర్గం అధ్యక్షులు ఆర్.జయకుమార్, నాయకులు డాక్టర్ క్రిష్ణమూర్తి, మండలాల కన్వీనర్ లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

అమరాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలదపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ, సీసీరోడ్డుకు ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం శ్రీ శనశ్చరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మనోనాయక్, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ లక్ష్మీనరసింహ, మండల కన్వీనర్ గణేష్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్, బీసీసెల్ తాలూకా ఉపాధ్యక్షులు మంజునాథ్ పాల్గొన్నారు.

చైర్మన్ ఎన్నికకు లైన్‌క్లియర్



నగర పంచాయతీ కార్యాలయం

మడకశిర టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ చైర్మన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రరెడ్డిలపై 15న అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. 20మంది కౌన్సిలర్లుకు 15 మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. దీంతో వారు ఇద్దరు పదువులు కోల్పోయినట్లు రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో త్వరలో మడకశిర నగర పంచాయతీకి కొత్త చైర్మన్ ఎన్నికకు లైన్‌క్లియర్ అయినట్లు అయ్యింది. గతంలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి ఎన్నికల అధికారిగా పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ హాజరై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. అందులో నైతికంగా టీడీపీ పార్టీ విజయం సాధించింది. దీంతో ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. నివేదిక ఆధారంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో మడకశిర నగర పంచాయతీ చైర్మన్ ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నారు.

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న జనం



తొలగించిన ఎస్‌బీఐ పాయింట్ షట్టర్

పరిగి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవామందిరం, కొడిగెనహళ్లి బిందునగర్, పరిగి గ్రామాల్లో మూడు నెలల్లోపే దాదాపు 13 చోరీలు చేసి పోలీసులకు సవాల్ విసురుతున్నారు దొంగలు. సోమవారం రాత్రి కొడిగెనహళ్లిలో ఎస్బీఐ పాయింట్‌లో, మూడు చిల్లర దుకాణాల షెట్టర్లను పగలకొట్టి అందులో నగదును దోచుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి క్లూస్ టీమ్‌ద్వారా ఆధారాలను సేకరించారు. వరుస చోరీలతో ప్రజలు ఇల్లు విడిచి వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా రాత్రిపూట పోలీస్ సిబ్బంది గస్తీ పటిష్టంగా చేపట్టామన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

మంగాపురంలో వృథాగా తాగునీరు



వృథాగా పోతున్న తాగునీరు

పెనుకొండ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ మంగాపురంలో పదిరోజులుగా తాగునీరు వృథా అవుతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిపైప్‌లైన్ పగిలిపోవడంతో నీరంతా రోడ్లపై ప్రవహిస్తూ ఉందని, దీంతో గ్రామంలో అందరినీ నీటి సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కౌన్సిలర్, మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీరిన శ్మశాన వాటిక సమస్య

పరిగి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తిరుమలదేవరపల్లికి శ్మశానవాటిక సమస్య తీరింది. కొద్ది సంవత్సరాలుగా శ్మశానవాటికను కొందరు దురాక్రమణ చేశారని గ్రామస్థులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె తహసీల్దార్ హసీనాసుల్తానాకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందితో కలిసి శ్మశానవాటికకు చేరుకుని సర్వేచేపట్టి హద్దులను సూచించారు. దీంతో ఓ వ్యక్తి 1.60ఎకరాల భూమిని పంచాయతీ అధికారులకు అప్పగించారు. శ్మశానవాటికకు వెళ్లడానికి రహదారిలో మామిడితోట అడ్డు ఉండటంతో పోరంబోకు స్థలం నుంచి 20 అడుగుల రోడ్డును కేటాయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సిద్దేశ్, సర్పంచ్ బాలు, పురుషోత్తం, ధనుంజయ పాల్గొన్నారు.



శ్మశానవాటికను పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

రైతుల్లో జోష్

పంటల సాగుకు అనుకూలంగా వర్షాలు



సాగవుతున్న మొక్కజొన్న పంట

చిలమత్తూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షం కోసం ఎదురు చూడాల్సిన పనిలేకపోయింది. మే 15 నుంచే మోస్తారు వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు దుక్కి పనులు సకాలంలో పూర్తి చేసుకున్నారు. దీంతోపాటు విత్తనాల విత్తుకోవడానికి అనుకూలంగా జూన్ ఆరంభం నుంచి పదునైన వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం నింపింది. నిలకడగా కురుస్తున్న వాన పంటలకు జీవం పోసింది. వేరుశనగ, జొన్న ఇతర పంటలకు ఈ నెల ఆరంభం నుంచి కురుస్తున్న వర్షాలు ఉపయోగంగా ఉన్నాయి. గత ఏడాది ఇదే నెలలో వర్షాలు ప్రారంభమైనా రుతుపవనాలు దారి మళ్లడంతో తీవ్ర వర్షభావం నెలకొంది. తొలకరి జల్లుల కోసం జూన్ నెలంతా నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో గత ఏడాది తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా కురుస్తున్న భారీవర్షాలు రైతులకు ఊరటనిస్తున్నాయి.

ఎరువులకు పెరుగుతున్న గిరాకీ

ఖరీఫ్ ప్రారంభం నుంచే వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంటల సాగులో బిజీ అవుతున్నారు. పంటల సాగుకి ఎరువుల కొనుగోలుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఎరువుల దుకాణాల్లో అక్కడక్కడ కొరత కనిపిస్తోంది. రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన స్టాకు లేకపోవడంతో పక్కనే ఉన్న కర్ణాటకకు తరలిపోతున్నారు. గత ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రాల్లో కేవలం యూరియా, డీఏపీ మాత్రమే లభించేవి. అవి కూడా తక్కువ నిల్వలతో ఉండేవి. దీంతో రైతులు ఎరువుల కోసం బయటికి వెళ్లక తప్పలేదు. ప్రస్తుతం కూడా పంటల సాగు జోరుగా సాగుతుండటంతో ఎరువుల కొరత ఉంది. దీంతో ఎరువుల దుకాణాల్లో ధరలు పెంచే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. డిమాండ్‌ని బట్టి బస్తాపై రూ. 50ల నుంచి రూ. 100లు పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాల ద్వారా అవసరమైన ఎరువులను ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రైతులు అంటున్నారు.

వర్షాలు కురవడంతో సంతోషంగా ఉంది



ఈ ఏడాది పంటలు సాగుచేసుకునేందుకు వీలుగా ముందుగానే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పొలాలను సకాలంలో దుక్కి చేసుకోగలిగాం. జూన్ ప్రారంభం నుంచే కావాల్సినంత వర్షాలు పడుతుండటంతో విత్తనాలను కూడా సకాలంలో విత్తుకోగలుగుతున్నాం. దీనికితోడు ప్రభుత్వం రైతులకు అండగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు సాయం అందజేయడానికి సిద్ధమైంది. దీంతో రైతులు పంటలు పెట్టుకోవడానికి వీలవుతుంది.

-గంగాధర్, చిన్నపురెడ్డిపల్లి

ఇండెంట్ పంపుతాం



ఖరీఫ్‌లో సాగవుతున్న పంటలను దృష్టిలో పెట్టుకొని కావాల్సిన ఎరువులకు ఇండెంట్ పంపుతాం. ఇప్పటివరకు అరకొరగా నిల్వలు ఉన్నాయి. ఇప్పటికే ఆయా రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు అవసరమైన ఎరువులను గుర్తించాం. వాటి కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పంపి త్వరతిగతిన ఎరువులను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఎరువుల దుకాణాల్లో ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాల్సి ఉంది. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తే రైతులు ఫిర్యాదు చేయవచ్చు.

-కవితారాణి, ఏఓ, చిలమత్తూరు మండలం

తుమ్మల మారెమ్మకు పూజలు



గుడిబండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలిసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



పెనుకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కాశీ విశ్వేశ్వరస్వామి, ఐముక్తేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు కన్నాస్వామి, రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రొద్దం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్.లోచర్ల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు తల్లికి వందనం ఎంతో ఉపయోగపడుతుందని వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం టీడీపీ నాయకులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, మురళి, నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

రొళ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పాఠ్యపుస్తకాలను, దుస్తులను విద్యార్థులకు టీడీపీ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటిగ వక్కళిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రిన్సిపాల్ మున్వర్ జాన్ పాల్గొన్నారు.

గ్యారెంటీల పేరుతో ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

జేడీఎస్ రాష్ట్ర యువ అధ్యక్షుడు నిఖిల్



మాట్లాడుతున్న నిఖిల్ కుమారస్వామి

పావగడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల నుంచి అధిక పన్నులు వసూలు చేస్తూ, గ్యారంటీల పేరిట రాష్ట్రాన్ని నిలువు దోపిడీచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర యువఅధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆంజనేయశెట్టి కల్యాణమండపంలో నిర్వహించిన జెడీఎస్ పార్టీ మిస్డ్‌కాల్ అభియాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ తాలూకాలో నిధులను దుర్వినియోగం చేసి తెలంగాణలో నడిచిన ఎన్నికలకు ఆ నిధులను వాడుకున్న ప్రభుత్వ కాంగ్రెస్ అని అన్నారు. కుమారస్వామి అధికారంలోకి వస్తే పంచరత్న యోజన పథకాలను ఇస్తామన్న హామీలను విమర్శించే హక్కు ఏ పార్టీకి లేదని అన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి పేరిట మోసం చేస్తూ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడం సిద్దరామయ్యకు సిగ్గుచేటన్నారు. 2028లో ముచ్చటగా మూడోసారి కుమారస్వామిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రజలు పెట్టుకున్నారని అందుకు మిస్డ్‌కాల్ చివరి నంబరు 2028అని రావడం కూడా అదృష్టమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు రష్మిక, పావగడ తాలూకా అధ్యక్షులు ఈరన్న, గోవిందబాబు, ఎస్‌కె రెడ్డి, అంజప్ప, జెడీఎస్ నాయకులు సురేంద్ర, చిన్న మల్లయ్య, జిల్లా మహిళ అధ్యక్షురాలు తహీరాబాను, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప సెల్‌ఫోన్ చోరీ

నిఖిల్ కుమారస్వామి పావగడలో మిస్డ్‌కాల్ అభియాన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పావగడ మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ఫోన్ చోరీకి గురైంది.

విధి నిర్వహణలో బస్సు డ్రైవర్ మృతి

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హిందూపురం డిపోకి చెందిన డ్రైవర్ నాగరాజు (49) విధినిర్వహణలోనే గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి డ్రైవర్లు, కుటుంబ సభ్యులు తెలిపారు. సంతేబిదనూరికి చెందిన నాగరాజు హిందూపురం నుంచి విజయవాడకు వెళ్లే బస్సుకి డ్రైవర్‌గా వెళ్లాడు. మంగళవారం ఉదయం విజయవాడ నుంచి హిందూపురానికి వస్తుండగా తాడిపత్రి సమీపంలోకి వచ్చే సరికి ఛాతిలో నొప్పి అధికంగా ఉందని, అక్కడ ఉన్న మరో డ్రైవర్‌కి చెప్పాడు. దీంతో అతడు డ్రైవ్ చేస్తూ తాడిపత్రిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే నాగరాజు మృతిచెందినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మృతుడుకి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తె ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి గ్రానైట్ వితరణ

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకంఠపురం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ.లక్ష విలువ చేసే గ్రానైట్‌ను వితర చేసినట్లు టీడీపీ నాయకుడు మంగేష్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్ గిరీష్, టీడీపీ నాయకులు తిమ్మయ్య, గంగాధర్, మహేష్, ఆదెప్ప, వెంకటేశ్, నరసింహప్ప, ఉదయ్, అంజి పాల్గొన్నారు.



ఆలయానికి అందించిన గ్రానెట్‌ను చూపుతున్న చైర్మన్, మంగేష్

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

హిందూపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాంచజన్య బ్రిలియన్స్ పాఠశాల 23వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు 70వ జన్మదిన వేడుకలను మంగళవారం రాత్రి పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 22ఏళ్ల క్రితం ఓ ఆశయంతో పాఠశాలను స్థాపించడం జరిగిందన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. లాభాపేక్షతో కాకుండా సేవా పేక్షతో సమాజాభివృద్ధికి తమవంతు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షులు సందీప్, కార్యదర్శి నందకుమార్, డైరెక్టర్‌లు భారతి, శ్రీనివాస్, సత్య, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్మిత క్రిష్ణ, అకడమిక్ డైరెక్టర్ నందిత సందీప్, ఏఓ భాస్కర్, హెచ్‌ఎం గాయిత్రి, విజయేంద్ర, శశికళ, అబ్దుల్‌రజాక్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి

- టీడీపీ నాయకులు



సమావేశమైన టీడీపీ నాయకులు

అమరాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, పార్లమెంట్ కార్యదర్శి శ్రీధర్, ఎన్నికల కోఆర్డినేటర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల టీడీపీ అధ్యక్షులు గణేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ అనుబంధ సంఘాల కమిటీలు ఏర్పాటుచేసి ఆ సంఘాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అబ్జర్వర్ రామాంజినేయులు, శ్రీధర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, గణేష్, శివరుద్రప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ



సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సోమందేపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మీ ఆకస్మికంగా తనిఖీచేశారు. సచివాలయంలో ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. పనివేళలను పాటించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలను అందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో మంగళవారం స్థానిక పాఠశాల విద్యార్థులకు ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, టీడీపీ నాయకులు ఆదినారాయణ, సర్వేపల్లి రాధకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాలకు, ఊరికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

పంట సాగులో మెలకువలు పాటించాలి

ఏఓ చందన



మావటూరులో మొక్కజొన్న పొలంలో వ్యవసాయాధికారులు

పెనుకొండ రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, మొక్కజొన్న సాగుచేసిన రైతులు మెళుకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ చందన సూచించారు. మంగళవారం మండలంలోని నాగలూరు, మావటూరు గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, మొక్కజొన్న సాగుచేసిన రైతులు పొలాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు అందించారు. అదేవిధంగా మొక్కజొన్న సాగులో మొగ్గదశలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు భవ్య, భావన, రైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటల్లో మెలకువలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారిణి కవితారాణి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలోని మొరసనపల్లి, ఎస్.ముద్దిరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో పంటల సాగుపై పలు విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ శ్రీవిద్య, విఏఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో మొక్కజొన్న పంటను సాగుచేస్తున్న రైతులు మెళుకువలు తప్పనిసరిగా పాటించాలని ఏఓ విజయభారతి సూచించారు. మంగళవారం మండలంలోని నల్గొండరాయనపల్లి, చాకర్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ట్రైప్-1 షెడ్ల కోసం మల్బరీ రైతులు సిరికల్చర్ అధికారిని సంప్రదించాలని ఏఓ కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశులు, మండల ప్రధాన కార్యదర్శి సూ ర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, రైతు సంఘం అధ్యక్షులు హరిక్రిష్ణ, శ్రీరాములు, ఏఈఓ అలైఖ్య, సిరికల్చర్, టెక్నికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పావగడ పోలీసులకు ఎస్పీ ప్రశంస



పావగడ పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, సిబ్బంది

పావగడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పావగడ పోలీసులకు ఎస్పీ నుంచి ప్రశంసలు దక్కాయి. 13 కేసుల్లో నిందితుల సొమ్మును రికవరీ చేసినందుకుగాను మంగళవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, ఏఎస్పీ గోపాల్, డీఎస్పీ మంజునాథ్ పావగడ పోలీసులను అభినందించారు. తుమకూరు, చిక్కబళ్లాపురం, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ద్విచక్రవాహనాలు, చైన్‌స్నాచింగ్ తదితర కేసుల్లోని నిందితులను పట్టుకున్నారు. రూ.42లక్షలు విలువచేసే 36 ద్విచక్రవాహనాలు, రూ.1.85లక్షల విలువచేసే 190 గ్రాముల బంగారం, 2.6 కేజీల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో కీలకపాత్ర పోషించిన పావగడ రూరల్ సీఐ గిరీష్, ఎస్ఐ విజయ్‌కుమార్, నాగేష్, నవీన్, తలవార్‌రాజు, దీపక్ తదితరులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

మడకశిర రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు గంటలు కూడా సరిగా విద్యుత్ సరఫరా ఉండకపోవడంతో ఇబ్బందులుపడుతున్నట్లు చెబుతున్నారు. వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరా మెరుగయ్యేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ ఏడీ రఘును వివరణ కోరగా విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను తొలగిస్తున్నారని, అందు కోసం విద్యుత్ సమస్య ఏర్పడిందన్నారు. రెండు రోజులో సమస్య పరిష్కారమవుతుందని వివరించారు.